పర్వత్‌నగర్‌లో రాత్రిపూట వెలగని స్ట్రీట్‌లైట్

అస్తవ్యస్తంగా స్ట్రీట్‌లైట్ల నిర్వహణ

అల్లాపూర్, నవంబర్ 7: అల్లాపూర్, మోతీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో పట్ట పగలు స్ట్రీట్‌లైట్లు వెలుగుతుండగా.. మరికొన్ని చోట్ల రాత్రిపూట వెలగడంలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్ట్రీట్‌లైట్ల సమస్యపై అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గాయత్రీనగర్ పరిధిలోని 60ఫీట్ల రోడ్డు సమీపంలో స్ట్రీట్ లైట్లు పట్టపగలు వెలుగుతుండగా.. గత మూడు నెలలుగా పర్వత్‌నగర్‌లో రాత్రిపూట లైట్లు వెలగడంలేదు. ఈ సమస్యపై జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ స్ట్రీట్‌లైట్ల విభాగం డీఈ, డివిజన్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్ల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గాయత్రీనగర్‌లో పట్టపగలే వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 7 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ కోరారు. గురువారం సర్కిల్ పరిధిలో ఇంటింటి సర్వేను డీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌ల పరిధిలో సర్వేను ప్రారంభించినట్లు తెలిపారు. రెండవ రోజు ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి కుటుంబాలకు చెందిన వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేపై ఎలాంటి అనుమానాలు వద్దని, సర్వేలో తీసుకున్న వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

పకడ్బందీగా సర్వే: డీసీ కృష్ణయ్య

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీసీ కృష్ణయ్య తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సర్వే తీరును డీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వేపై ప్రజలు అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేకు సహకరించాలన్నారు. ప్రతి ఇంటికి సర్వే కోసం ఎన్యూమరేటర్లు వస్తారని, వారు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి సహకరించాలని కోరారు.

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో..

దుండిగల్, నవంబర్ 7: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం గురువారం బహుదూర్‌పల్లి వార్డులో జరిగింది. ఈ సర్వేను మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా సందర్శించి.. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. శుక్రవారం

బహదూర్‌పల్లిలో జరుగుతున్న సమగ్ర సర్వే తీరును పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, చిత్రంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు

వరకు ఇండ్ల జాబితా, హౌస్ యజమానుల వివరాలను ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకొని రాసుకోవాలని, అదే విధంగా ఇంటింటికి సర్వే స్టిక్కర్ అంటించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, స్పెషల్ ఆఫీసర్ బాబు మోసెస్, మున్సిపల్ మేనేజర్ సునంద, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్స్ పాల్గొన్నారు.

- రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేతో పాటు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గురువారం సూరారం డివిజన్, షాపూర్‌నగర్‌లో నిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటి గోడకు స్టిక్కర్‌ను అతికించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నెలలోపు కులగణను పూర్తి చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. ఈ సర్వే చేయడానికి ఇంటికి వచ్చిన అధికారులకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండి ప్రతి కుటుంబం వద్ద సర్వే వివరాలను వివరించే విధంగా అధికారులకు సహకరించాలని సూచించారు.

ఇంటికి స్టిక్కర్ అతికించిన ఎన్యూమరేటర్లతో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

సర్వేలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఉద్యోగులు

నలగండ్లలో ఘనంగా ఛఠ్‌పూజ

గచ్చిబౌలి డివిజన్, నలగండ్ల చెరువు సమీపంలో ఉత్తర భారతీయులు గురువారం సాయంత్రం ఛఠ్‌పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చండీఘడ్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, గయా, రాంచీ, ఢిల్లీ, ముంబై ప్రాంతాలకు చెందిన ప్రజలు కార్తీకమాసంలో ఏంతో పవిత్రంగా జరుపుకునే ఈ ఛఠ్‌పూజను వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ , నాయకులు రఘునాథ్‌రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణ, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, లక్ష్మణ్, సురేశ్ నాయక్ పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి, నవంబర్ 7

ఎంపీ రఘునందన్‌ను కలిసి ఎల్ఐసీ ఏజెంట్లు

భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సంఘ్ ప్రతినిధులు గురువారం ఎంపీ రఘునందన్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్ఐసీ ఏజెంట్లు ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందలేకపోతున్నారని, ఈఎస్ఐ, కనీస పింఛన్ లేదని, ఈ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీని సంఘ్ ప్రతినిధులు పిన్నింటి సంపత్‌రావు, సోమనర్సయ్య, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డిలు కోరారు.

– సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ)

కుక్కల బెడదనుంచి ప్రజలను కాపాడాలి

కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, నవంబర్7: అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ వీధుల్లో తిరిగేవారిపై దాడిచేస్తున్నాయని, దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకో వాలని కార్పొరేటర్ సబీహాబేగం కోరారు. ఇటీవల డివిజన్ పరిధిలోని రాణాప్రతాప్‌నగర్‌లోని వీధిలో ఆడుకుంటున్న రెండున్నరేండ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంగతి విధితమే. ఈ క్రమంలో ఆసుప్రతిలో చికిత్స పొంది.. తిరిగి ఇంటికి వచ్చిన బాలుడిని కార్పొరేటర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల అల్లాపూర్ లో ప్రజలపై కుక్కలు దాడిచేస్తున్న ఘటనలు వరుసగా జరుగుతున్నాయన్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత జీహెచ్‌ఎంసీ అధికారులపై ఉందన్నారు.

ఆస్పత్రి బిల్లులు పెరిగాయి..సహాయం పెంచండి

పీఏసీ చైర్మన్ గాంధీ.. రూ.24.60 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

మియాపూర్, నవంబర్ 7 : ప్రైవేటు దవాఖానల్లో వైద్య ఖర్చుల బిల్లులు పెరిగినప్పటికీ పాత పద్ధతి ప్రకారమే బాధితులకు సహాయం అందిస్తున్నారని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. పెరిగిన బిల్లులను దృష్టిలో పెట్టుకుని ఈ పథకం ద్వారా అందించే సాయాన్ని మరింతగా పెంచాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 60 మందికి అత్యవసర వైద్యసేవల నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ.24.60 లక్షల ఆర్థిక సాయం చెక్కులను గురువారం ఆయన తన నివాసంలో అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం సాయం నిరుపేదలకు గొప్ప వరంలా ఉపయోగపడుతున్నదన్నారు. అయితే నాటి బిల్లులకు అనుగుణంగా అందిస్తున్న సాయం సరిపోవడం లేదని , దీనిని పెంచడం ద్వారా పేదలకు మరింత ఆర్థిక ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ విషయమై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, అశ్వర్, శ్రీనివాస్, రాజేందర్, కాశీనాథ్, ఇబ్రహీం, అష్రోఫ్, అనీల్, శ్రీనివాస్, శ్రీధర్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : బండి రమేశ్

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 7 : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. గురువారం మూసాపేట డివిజన్‌కు చెందిన ఎం.నూనరాజుకు వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ .18,500లు, పి. ఇందుకు రూ. 24,500ల చెక్కులను గురువారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ప్రభుత్వం అండగా నిలబడి ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బీబ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, సీనియర్ నాయకుడు జి.వెంకటేశ్వర్‌రావు, మేకల రమేశ్, అస్లాం, అరుణ్ , తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్న శంభీపూర్‌కృష్ణ



శివుడు అగ్నిలింగంగా అవతరించిన పవిత్ర ప్రదేశం అయినటువంటి అరుణాచలేశ్వరుని గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత శంభీపూర్‌కృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – దుండిగల్, నవంబర్7

మతి స్థిమితం లేని వృద్ధుడు అదృశ్యం

కోటేశ్వర రావు(ఫైల్0

దుండిగల్, నవంబర్ 7: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఏపీలోని కృష్ణాజిల్లా, అవనిగడ్డకు చెందిన గౌరినాగబాబు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,ప్రగతినగర్ ఎన్ఆర్ఐ కాలనీ లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. గురువారం సాయంత్రం నాగబాబు తండ్రి కోటేశ్వరరావు (75) ఇంటిముందు కూర్చుని.. 15 నిమిషాల అనంతరం కనబడకుండా పోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం అదుపు తప్పి.. వ్యక్తి మృతి

ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

దుండిగల్, నవంబర్ 7: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బాచుపల్లిలోని క్రాంతినగర్ కాలనీలో ఉంటున్న ఉపేందర్‌రెడ్డి(55) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఆఫీస్‌వాపై బహదూర్‌పల్లి చౌరస్తా మీదుగా గండిమైసమ్మ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. వేధిక ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఉపేందర్‌రెడ్డి మృతి చెందినట్లు తేల్చారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుల అరెస్ట్

కుత్బుల్లాపూర్,నవంబర్7: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేశ్ కుమార్ వివరాలను వెల్లడించారు. ప్రగతినగర్ లేక్‌వ్యూ కాలనీలో దుండగులు ఈ నెల 4 అర్ధరాత్రి గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన బాచుపల్లి పోలీసులు.. బాలానగర్ జోన్ ఎస్ఓటీతో కలిసి నిందితుల కోసం గాలించారు. గురువారం నిందితులు పట్టుబడ్డారు. నిందితులు బాచుపల్లి పరిధిలోని 191 కాలనీకి చెందిన కొప్పడి నవీన్, వరలక్ష్మి నరసింహా, బ్రహ్మాయ్య, ప్రవీణ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. అక్కడ గాంధీ విగ్రహం ఏర్పాటు చేసిన తర్వాత ఇబ్బందిగా మారిందని భావించి.. ధ్వంసం చేసినట్టు నిందితులు తెలిపారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

వీధి కుక్కల బెడద.. వెలుగని వీధి దీపాలు

- రాత్రయ్యిందంటే పాముల బెడద..
- ఫిర్యాదులు చేసినా పట్టని సిబ్బంది, అధికారులు
- భయాందోళనలో నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ ప్రజలు

నార్త్ ఎన్‌సీఎల్‌లో వెలుగని వీధిదీపాలు.. పక్కన టార్చ్‌లైట్లు వేసుకొని వెళ్తున్న మహిళలు

కుత్బుల్లాపూర్, నవంబర్ 7 : అసలే వీధికుక్కల భయంతో ఆ కాలనీవాసులంతా బిక్కుబిక్కుమంటున్నారు.. ఇక రాత్రయ్యిందంటే వీధి దీపాలు వెలుగక అంధకారంగా మారడంతో కాలు బయటపెట్టాలంటే పాములు, తేళ్లు వంటి విషప్రాణులతో ఆందోళనలు చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఇటు వైపుకు కన్నెత్తి కూడా చూడడం లేదని మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి, నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో వీధి కుక్కల బెడదతో పాటు వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా రాత్రి వారంతపు సంతకు వచ్చే మహిళలు తిరిగి తమ ఇండ్లకు వెళ్లే సమయంలో వీధికుక్కలతో పాటు పాములు, తేళ్లు వంటివి రోడ్డుపై వచ్చి చేరుతున్నాయని, దీంతో చిన్నపిల్లలు, మహిళలు, పాదాచారులు బయట నడుచుకుంటూ వెళ్లేందుకు జంకుతున్నారు. కేవలం 12, 13 వార్డుల్లో సుమారు 20 వీధిస్తంభాలకు వీధి లైట్లు వెలుగకపోవడంతో సమస్య మరింత జఠిలంగా మారుతుందని కాలనీవాసులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నార్త్ ఎన్‌సీఎల్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదని పలుమార్లు కాలనీవాసులు కొంపల్లి మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పాపానపోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బందికి స్థానికంగా ఉన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో కాలనీవాసులను ఏకం చేసి ఆందోళనలు చేస్తామని బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజ్ డిమాండ్ చేశారు.

గణితంలో ప్రపంచ రికార్డును సాధించిన విద్యార్థులు

ఘనత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కుత్బుల్లాపూర్, నవంబర్ 7: ఆరు వందల గణిత సూత్రాలను అవలీలగా చెప్పగలిగి తమ సత్తాను చాటుకున్న కొంపల్లి శ్రీచైతన్య-5 బ్రాంచ్ ప్రైమరీ విద్యార్థులు.. ప్రపంచ రికార్డు సంస్థ సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన రికార్డు ఈవెంట్‌లో సత్తా చాటుకున్న విద్యార్థులకు రికార్డును అందించారు. రికార్డును అందుకున్న విద్యార్థులను శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ, నాగేంద్ర, సీఓఏ పుష్పవల్లి, కొంపల్లి ఏజీఎం జివి.రమణారావు అభినందించారు. గణితంలో సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డును సాధించడం అరుదైన అవకాశమని, ఇలాంటి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి..

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 7 : మూసాపేట సర్కిల్ పరిధిలో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో జీహెచ్‌ఎంసీ జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని, జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు బాలాజీనగర్‌కు చెందిన సుశీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అనుమతులు కుమించి రెండు, మూడు ఫ్లోర్లు అదనంగా నిర్మిస్తున్నారన్నారు. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న ఈ కట్టడాలపై సర్కిల్ స్థాయి, జోనల్‌స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తే... పట్టించుకోవడం లేదన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంవల్ల ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



గండిమైసమ్మ-మియాపూర్ రోడ్డులో

స్తంభించిన ట్రాఫిక్

గండిమైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అడుగుతీసి అడుగు పెట్టే పరిస్థితిలేక పోవడంతో ఏం చేయాలోతోచక వాహనదారులు అవస్థలు పడ్డారు. ప్రధానంగా బౌరంపేట్‌లోని డీఆర్‌కే కళాశాల బస్‌స్టాప్ నుంచి ఇందిరమ్మ విగ్రహం వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్‌పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు.అయితే ఓ వాహనం బ్రేక్‌డౌన్ కావడంతోనే గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిందని పోలీసులు పేర్కొన్నారు. – దుండిగల్, నవంబర్ 7

గంజాయి మత్తులో యువకుడి వీరంగం

కుత్బుల్లాపూర్, నవంబర్ 7 : గంజాయి మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించిన ఘటన గురువారం కుత్బుల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో ఇంటి ముందు వీరంగం సృష్టించాడు. ఈ విషయమై స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ పగిడి శ్రీనివాస్‌రెడ్డి, తండ్రి: శ్రీ పగిడి మధుసూధన్‌రెడ్డి, నివాసం: విల్లా నెం. 41, సుభిక్ష మిస్ట్ లగ్జరీ, మొకిలా, శంకర్‌పల్లి, కె.వి.రంగారెడ్డి వారు గాజులరామారం గ్రామం, కుత్బుల్లాపూర్ మండలం మరియు మున్సిపాలిటీ, రంగారెడ్డి జిల్లా వద్దగల, సర్వే నెం. 228/పార్ట్‌లో ఎక. 0-13.33 గుంటల విస్తీర్ణపు భూమి యావత్తుకు అసలు యజమాని మరియు స్వాధీనదారు అని అతను తెలియజేశాడు మరియు అతను పైన తెలిపిన ఆస్తి యొక్క డాక్యుమెంట్ నెం. 2658/2007, తేది: 03-02-2007 కలిగిన ముందస్తు రిజిస్టర్డ్ గిఫ్ట్‌డీడ్ పోగొట్టుకున్నారు.

సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో 7 రోజులలోగా దిగువ సంతకందారుకు సంప్రదించండి మరియు దిగువ సంతకందారుకు అప్పగించగలరు. ఎవరైనా వ్యక్తి/వ్యక్తులకు, బ్యాంకులకు/ఆర్థిక సంస్థలకు ఏదేని అభ్యంతరం, క్లెయిమ్, హక్కు, ప్రయోజనం, వివాదం కలిగి ఉన్నచో అతను/ఆమె/వారు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 7 రోజులలోగా అతని/ఆమె/వారి అభ్యంతరం, క్లెయిమ్, హక్కు, బ్లెటిల్, ప్రయోజనం, వివాదాల వివరాలను దృవీకరించడానికి డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును, లేనిలో ఎలాంటి అభ్యంతరాలు/క్లెయిమ్‌లు/వివాదాలు లేవని భావించబడును మరియు ఆ తరువాత ఎలాంటి క్లెయిమ్‌లు మరియు వివాదాలు అనుమతించబడవు. పై సదరు డాక్యుమెంట్ పోయినందున ఎవరికో ఏవిధమైన లావాదేవీ నిర్వహించారని లేదా కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సం/- ప్రసాద రావు అప్కారి, అడ్వకేట్
ఫ్లాట్ నెం. 103, కృష్ణారెడ్డి విల్లా, బ్లాక్ బి, ఇం.నెం. 1-11-271/డి1/1038, గగన్‌విహార్ కాలనీ, భగవంతపురం, బేగంపేట్, హైదరాబాద్,
ఇమెయిల్: advprasad.apkari@outlook.com;
మొబైల్: 9582795964, 8106795964, 040-35941590.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 7 : ఈ నెల 9, 10 తేదీల్లో మేడ్చల్ జిల్లా కీసరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీలకు కేపీహెచ్‌బీ కాలనీలోని ఎస్‌ఆర్ఎస్‌టీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ఎం.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమ్మకంతోనే రోగులకు సేవలందించగలం

మెడికవర్ దవాఖాన వైద్యులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

కొండాపూర్, నవంబర్ 7 : వైద్యంలో నమ్మకమే ముఖ్యమని, డాక్టర్లపై నమ్మకం ఉంటేనే రోగులకు నయం చేయగలమని మెడికవర్ దవాఖాన వైద్యులు వెల్లడించారు. గురువారం హైటెక్‌సిటీలోని దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ... జూనియర్ డాక్టర్ నాగప్రియ మృతిపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాతే దవాఖానలో చేరారని, అప్పటికి ఆమె బతికే అవకాశాలు కేవలం 20 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. పుడ్‌పాయిజన్ కారణంగా పలు దవాఖానల్లో చికిత్సను తీసుకున్న ఆమె, ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాతే మెడికవర్‌లో చేరిందన్నారు. అప్పటికి ఆమె లివర్‌తోపాటు ఇతర అవయవాలు ఫెయిల్యూర్ అయ్యాయని, వెంటిలేటర్ సహాయంతోనే అడ్మిట్ చేశారన్నారు. డబ్బుల కోసమే ఆమెను చంపారంటూ వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి సత్యం లేదని, నిజనిజాలు తెలుసుకున్న తర్వాతే ఆరోపణలు చేయాలన్నారు. సమావేశంలో దవాఖాన వైద్యులు పాల్గొన్నారు.